

ఆర్థిక అక్షరాస్యత అవసరం

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

ఆర్థిక అక్షరాస్యత ప్రతిఒక్కరికీ అవసరమని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆర్థిక అక్షరాస్యతపై రిజర్వు బ్యాంకు ఆదేశాల మేరకు రూపొందించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో ఆయన విడుదల చేశారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎన్.మూర్తి మాట్లాడుతూ మంచి ఆర్థిక ప్రవర్తన - విమ్ములను కాపాడుతుంది అనే నినాదంతో రిజర్వు బ్యాంకు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమానికి పిలుపునిచ్చిందన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను ఈ నెల 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిజివిబి ప్రాంతీయ మేనేజర్, ఎస్‌బిఐ, డిసిసిబి తదితర బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

కెవిఎల్‌పురంలో ట్యాంకరు నీటిని పట్టుకుంటున్న మహిళలు

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ఒక మనిషి అవసరాల కోసం రోజుకు 130 లీటర్లు నీరు అవసరం. విజయనగరం జిల్లా కేంద్రంలో 3లక్షలు దాటి జనాభా ఉన్నారు. దీని ప్రకారం 42 ఎంఎల్‌డి నీరు నగర ప్రజలకు అవసరముంది. కానీ నేడు నగర ప్రజలకు సరాసరి రెండు రోజులకు కలిపి 130 లీటర్లు నీరు కూడా అందడం లేదు. రోజుకు నగర పాలక సంస్థకు 27ఎంఎల్‌డి నీరు కూడా సరఫరా కావడమే దీనికి కారణం. పాలకవర్గాలు మారుతున్నా నగర ప్రజలకు తాగునీటి అవస్థలు తప్పడం లేదు. దీంతో నగరానికి వస్తున్న నీటిని ఒక రోజు 25 డివిజన్లకు, మరుసటి రోజు మరో 25 డివిజన్లకు సరఫరా చేస్తున్నారు.

ఎన్నాళ్లీ అవస్థలు?

- అవసరం 42 ఎంఎల్‌డి.. వస్తున్నది 27 ఎంఎల్ డి
- రోజు తప్పించి రోజు తాగునీటి సరఫరా
- రూ.65 లక్షలతో సమ్మర్ ప్లాన్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలో 50 డివిజన్‌లు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ప్రజలకు రోజు తప్పించి రోజు మాత్రమే నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో అరకొర నీటితో నగర ప్రజలు సర్దుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో వైపు రూ.200కే కుళాయిలు సుమారుగా 10వేల మందికి ఇచ్చారు. కుళాయి కనెక్షన్లు ఇచ్చినా నీటి సరఫరా మాత్రం జరగలేదు.

అంతా లీకేజీలమయం

నగరంలో తాగునీటి సరఫరాలో పైపులైన్లలో లీకేజీలు అధికంగా ఉన్నాయి. 30 ఏళ్ల కిందట వేసిన పైపు లైన్లు కావడంతో నగరంలో అనేక ప్రాంతాల్లో లీకేజీలు పెరిగాయి. దీంతో గత రెండు నెలలుగా లీకేజీలు అరికట్టేందుకు రూ.11లక్షలు ఖర్చు చేసి మరమ్మత్తులు చేశారు. ఇటీవల రోడ్లు వెడల్పు కార్యక్రమంలో ఏర్పడిన 16 లీకేజీ పాయింట్లను కార్పొరేషన్ అధికారులు బాగు చేశారు. లీకేజీల అరికట్టేందుకు నూతన పైపు లైన్లు వేస్తే తప్ప శాశ్వత పరిష్కారమయ్యే అవకాశం కనిపించడం లేదు.

విలీన ప్రాంతాలకు అందని తాగునీరు

నగర పాలక సంస్థ లో విలీనమైన గాజులరేగ, జమ్ము నారాయణ పురం, కెవిఎల్ పురం, ధర్మపురి, అయ్యన్నపేట వంటి ప్రాంతాలు విలీనం జరిగి ఆరేళ్లు దాటుతున్నా నేటికీ పైపు లైన్లు ద్వారా తాగునీరు సరఫరా కావడం లేదు. అమృత పథకం ద్వారా పైపు లైన్లు, రూ.200కే కుళాయి కనెక్షన్లు ఇచ్చారు తప్ప ఆ కుళాయిలు ద్వారా ఇచ్చే నీరు మాత్రం నేటికీ సరఫరా కావడం లేదు. దీంతో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. మరోవైపు నగరంలో భాగంగానే ఉన్న తోటపాలెం వైఎస్ఆర్ కాలనీకి నేటికీ కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేయకపోవడంతో వారంతా తమ ఇంటి బోరు నీటిపైనే ఆధారపడుతున్నారు.

రూ.65 లక్షలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్

మరో వైపు వేసవి సమీపిస్తుండటంతో నగర పాలక సంస్థ అధికారులు నీటి ఎద్దడిని అధిగమించేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. వాస్తవానికి వేసవి వస్తే నెల్లిమర్ల నీటి పథకాలు నుంచి నీటి సరఫరా తగ్గి పోనుంది. దీంతో నీటి ఎద్దడిని అధిగమించేందుకు రూ.65 లక్షలతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. దానిలో రామతీర్థం ప్రోజెక్ట్ నుంచి నీటిని మరలించేందుకు శాండ్ బ్యాగ్స్ కోసం రూ.9.25లక్షలు, గోస్తనీ నదిలో నీరు స్టోరేజ్ కోసం అవసరమైన ఇసుక బ్యాగ్‌ల కోసం రూ.9.99లక్షలు, మధుపాడ నీటి పథకం వద్ద వెల్ సింకర్స్ రిమూవల్ కోసం రూ.8.50లక్షలు, రామతీర్థం ప్రోజెక్ట్ వద్ద వెల్ సింకెర్స్ రిమూవల్ కోసం రూ.6.58లక్షలు, బోర్ వెల్స్ ఫ్లాషింగ్ కోసం రూ.10లక్షలు, 1వ డివిజన్ నుంచి 50వ డివిజన్ వరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కోసం రూ.11.10లక్షలు, కేటాయించారు. ఆంధ్ర రిజర్వాయర్ నుంచి నెల్లిమర్ల పంప్ హౌస్‌కు నీటిని మళ్లించేందుకు రూ.9.95లక్షలతో ప్రతిపాదనలు తయారు చేశారు.

పైపులైన్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

చిట్టీల వ్యాపారి టోకరా

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలో ఓ చిట్టీల వ్యాపారి కోట్లాది రూపాయలకు టోకరా వేసి పరారయ్యాడు. దీంతో కూలీ నాలి చేసుకుని కుటుంబ పోషణ ఖర్చులు పోగా మిగిలిన డబ్బును నెలనెలా చిట్టీ కడితే ఆ డబ్బు అవసరాలకు పనికొస్తుందని భావించిన వారంతా లబోదిబోమంటున్నారు. సోమవారం స్థానిక పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

నమ్మకంగా ఉంటూ చిట్టీలను నడిపే మండవిల్లి సోమశేఖర్ (39) పట్టణానికి చెందిన అనేకమంది పేద, మధ్యతరగతి ప్రజలను నిలువునా ముంచేశాడు. కూతురు పెళ్లి కోసమనో, పిల్లల చదువు కోసమనో చాలా మంది సోమశేఖర్ దగ్గర చిట్టీలు కట్టారు. పట్టణానికి చెందిన కొంతమంది చిరువ్యాపారులు కూడా ఆయన వద్ద చిట్టీలు కట్టి మోసపోయారు. వీరంతా సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌కి వచ్చి తమ గోడు వెలిబుచ్చారు. టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు దృష్టికి తాము మోసపోయిన వైనం గురించి వివరించారు. ఆయనకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

పరారైన చిట్టీల వ్యాపారి సోమశేఖర్ ఐపి పెట్టినట్లు తెలుస్తోంది. దీనికోసం కోర్టులో ఆయన పిటిషన్ వేశారనే ప్రచారం సాగుతోంది. సోమశేఖర్ ఎవరెవరికి బాకీ ఉన్న విషయాన్ని దానిలో పొందుపరిచినట్లు తెలుస్తోంది. ఇదే తరహాలో పట్టణానికి చెందిన మరో వ్యాపారి కూడా కోట్లాది రూపాయలకు టోకరా పెట్టి పరారైనట్లు ప్రచారం సాగుతోంది. దీనిపై ఇంకా బాధితులు పోలీసులను ఆశ్రయించలేదు. అనధికార చిట్టీలు కట్టొద్దని పోలీసులు హెచ్చరిస్తున్నా పేద, మధ్యతరగతి ప్రజలు వాటి నిర్వాహకుల వలలో పడి మోసపోతున్నారు.

విచారణ చేపడతాం

అనధికార చిట్టీల్లో చేరి మోసపోయిన పట్టణ ప్రజల నుంచి ఫిర్యాదు అందింది. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. అనధికార చిట్టీ వ్యాపారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నా ప్రజల వైఖరిలో మార్పు లేదు. ఒకవైపు ఇలాంటి సంఘటనలలో మోసపోయిన బాధితుల గురించి మీడియాలో వార్తలు వస్తున్నా ప్రజల్లో చైతన్యం రావడం లేదు.

- సిహెచ్.శ్రీనివాసరావు, టౌన్ సిఐ, సాలూరు

15న డిఇసి మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

జిల్లాలో ఈ నెల 15న డిఇసి, ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. నులిపురుగుల నివారణకు అల్బెండజోల్, బోధవ్యాధి నివారణకు డిఇసి మాత్రలు ఉపయోగపడతాయని చెప్పారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఆల్బెండజోల్, డిఇసి మాత్రల పంపిణీపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మందుల పంపిణీ పక్కాగా చేపట్టాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. 15న మందులు తీసుకోని వారికి 16, 17 తేదీల్లో పంపిణీ జరుగుతుందని వివరించారు. పాఠశాలలలో శత శాతం మాత్రలు పంపిణీ చేసేందుకు ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేయాలని డిఇఒకు సూచించారు. డిఎంహెచ్ఒ బగాది జగన్నాథరావు మాట్లాడుతూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు..

పోటీలను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆనంద్ ; విల్లు ఎక్కుపెట్టిన క్రీడాకారిణి

ఆర్చరీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

పార్వతీపురం జూనియర్ కళాశాల ప్రాంగణంలో 66వ రాష్ట్ర స్థాయి ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అండర్-14, 17 బాలబాలికల విభాగాల్లో నిర్వహించే ఈ విలువిద్య క్రీడా పోటీలను జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు జ్యోతి ప్రజ్వలన, జాతీయ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. పోటీలు మూడు రోజులపాటు జరగనున్నాయి. బాలురు 250 మంది, బాలికలు 250 మంది, 15 మంది సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. ఈ విలువిద్యా పోటీలు రిజర్వు, కాంపౌండ్, ఇండియన్ రౌండ్స్ విభాగాల్లో నిర్వహిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ క్రీడాకారులు ఆత్మ స్థైర్యంతో, పట్టుదలతో, ఏకాగ్రతతో ఆడాలని, అప్పుడు గెలుపు, పతకాలు సిద్ధిస్తాయని చెప్పారు. ప్రతి ఒక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్రీడాకారులకు ఆయన సూచించారు. ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వర రావు, డిఇఒ ఎస్.డి.వి.రమణ, ఆర్చరీ సెక్రటరీ డి.గాంధీ, ప్రతినిధులు జి.భానుమూర్తి, ఎం.మనోహర్ పాల్గొన్నారు.

జంపరకోటకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలోని జంపరకోట ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లోనైనా నిధులు పూర్తిస్థాయిలో కేటాయించి, పూర్తి చేసేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం తిరుపతిరావు, మండల కన్వీనర్ డి.రమణరావు డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రెండు దశాబ్దాల క్రితం రూ.2 కోట్లతో ప్రారంభించిన ప్రాజెక్టు నేటికీ పూర్తి కాకపోవడం దారుణమన్నారు. జిల్లా విభజనతో ఈ ప్రాంతం మరింత వెనుకబడిన విషయాన్ని పాలకులు గమనించాలని కోరారు. ఈ పర్యాయం నిర్మాణానికి పునుకోకుంటే రైతులతో కలిసి పోరాటానికి సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జానకి ఎంపిక

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు గిరిజన గురుకుల విద్యార్థిని ఎం.జానకి ఎంపికైంది. గుంటూరు జిల్లా నరసరావుపేటలో త్వరలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో జానకి పాల్గొననుందని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పి.అరుణ, మౌళి తెలిపారు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపల్ ఎం.కమల కుమారి, వైస్ ప్రిన్సిపల్ తిరుపతిరావు, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

స్పందనకు వినతుల వెల్లువ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 90 అర్జీలు అందాయి. కలెక్టరు నిశాంత్ కుమార్, జాయింటు కలెక్టరు ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూఅధికారి జి.వెంకటరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వాటిలో కొన్ని...

- తోటపల్లి బ్యారేజ్ ఎడమ కాలువ ఒకటి, రెండు బ్రాంచ్ కెనాల్స్ ప్రస్తుతం పని చేయకపోవడం వల్ల కౌలు రైతులు ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే సాగునీరు విడుదల చేయాలని గరుగుబిల్లి మండలం నాగూరు గ్రామానికి చెందిన ఎ.మధుసూదనరావు విన్నవించారు. మండలంలో సుమారు 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాలను నేటికీ ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యకంచేశారు.
- మక్కువ మండలం ఆలగరువు గ్రామానికి చెందిన ఎస్.నాగేశ్వరరావు.. ఆలగరువు, పనసభద్ర ఉపాధి హామీ కింద గ్రావెల్ రోడ్డు వేశామని, దానికి ఆడిట్ కూడా జరిగిందని, సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని కోరారు.
- మక్కువ మండలం కవిరిపల్లి గ్రామానికి చెందిన ఆర్.కృష్ణమూర్తి సర్వే నెంబర్ 70,71,72 తన భూమిని సర్వే చేసి, ఇతరుల పేరు మీద నమోదు చేశారని, పాస్ పుస్తకం, టైటిల్ డిడిలో తన పేరు నమోదు చేయాలని విజ్ఞప్తిచేశారు.
- మక్కువ మండలం లోతుగడ్డ గ్రామానికి చెందిన రైతులు గత 22 సంవత్సరాలుగా సర్వే నెంబర్ 164లో భూమిని సాగు చేస్తున్నామని, ఆ భూమికి పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేయాలని వినతి అందించారు.
- పార్వతీపురం మండలం పుట్టూరు పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్‌గా విధులు నిర్వహిస్తున్నామని, తమకు 11 నెలలుగా జీతం అందడం లేదని కె.రమేష్, పి.శివుడు, డి.పద్మ ఆవేదన వ్యక్తంచేశారు. రావాల్సిన జీతం ఇప్పించాలని కోరారు.
- మక్కువ మండలం శంబర గ్రామానికి చెందిన జి.లక్ష్మణరావు రైతు భరోసా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని దరఖాస్తు అందజేశారు.
- కొమరాడ మండలం మాదిలింగిలో సర్వే నంబర్100లో 1-50 భూమిని వేరే వారు ఆక్రమించారని, వారిపైన చర్యలు తీసుకోవాలని ఎ.పకీర్ నాయుడు కోరారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఈ కార్యక్రమంలో డిఇఒ ఎస్.వి.రమణ, డిఎంహెచ్ఒ బి.జగన్నాథరావు, పశుసంవర్ధక శాఖ జెడి ఎ.ఈశ్వర రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎం.వి.జి.కృష్ణాజి, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టిబాబు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్ మూర్తి, డిపిఒ బలివాడ సత్యనారాయణ, జిల్లా ప్రణాళిక అధికారి పి. వీరరాజు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐటిడిఎ స్పందనకు 38 వినతులు

సీతంపేట : సీతంపేట ఐటిడిఎలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని ఎపిఒ రోషి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ స్పందన కార్యక్రమానికి 38 అర్జీలు వచ్చాయి. పూతికగూడకు చెందిన పార్వతి పోడు భూములకు రాతి కట్టడాలు మంజూరు చేయాలని విన్నవించారు. జగ్గాపురం గ్రామానికి చెందిన గేదెల కోటేశ్వరరావు బిటి రోడ్డు మంజూరు చేయాలని కోరారు. కాంగూడకు చెందిన సరస్వతి సామాజిక భవనం మంజూరు చేయాలని కోరారు. లంబగూడకు చెందిన బాపయ్య వరద గోడ మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ఎటిడబ్ల్యుఒ మంగవేణి, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.మురళి, సిడిపిఒ రంగలక్ష్మి, ఒఎస్‌డి యుగంధర్, సిడిపిఒ రంగలక్ష్మి, సూపరింటెండెంట్ దేశ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గిరిజన బాలిక మృతి

ప్రజాశక్తి-కొమరాడ

సుమిత్ర (ఫైల్)

అనారోగ్యంతో గిరిజన బాలిక మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని ఉలిపిరి గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కోలక సుమిత్ర అనారోగ్యంతో మృతి చెందినట్లు హెచ్ఎం లక్ష్మీకాంతం తెలిపారు. హెచ్ఎం కథనం ప్రకారం.. ఆదివారం మెడ భాగంలో నొప్పి వచ్చిందని సుమిత్ర చెప్పడంతో వెంటనే ఆశ్రమ పాఠశాలలో ఉన్న ఎఎన్ఎం సహాయంతో కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ తనిఖీ చేసిన వైద్య సిబ్బంది పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో వైద్యులు తనిఖీలు చేసి ఫిట్స్‌గా గుర్తించి చికిత్స అందించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో విజయనగరం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో ఆదివారం అర్ధరాత్రి విశాఖపట్నం కెజిహెచ్‌కి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షలు చేసి చికిత్స అందిస్తుండగా సోమవారం ఉదయం ఏడున్నర గంటల సమయంలో సుమిత్ర మృతిచెందింది. విద్యార్థి సొంత గ్రామం నయా. ఈ మేరకు వైద్యులు, పాఠశాల సిబ్బంది విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఆ గ్రామానికి తీసుకువచ్చారు.

గతంలో విద్యార్థినికి ఫిట్స్ ఉండేదని కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఎటిడబ్ల్యుఒ సురేష్ కుమార్ తెలిపారు. ఆ బాలిక ఉలిపిరి పాఠశాలలో ఐదో తరగతి నుంచి చదువుతోంది. ఎప్పుడూ అనారోగ్యం బారిన పడలేదని సిబ్బంది చెబుతున్నారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియలేదు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం

పామాయిల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-సాలూరు

పామాయిల్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం నియోజకవర్గ పరిధిలోని కార్మికులు స్థానిక లేబర్ అధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పామాయిల్ కార్మికుల సంఘం జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యాన కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు రోజువారీ కూలి వెయ్యి రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. లోడింగ్, అన్ లోడింగ్ కూలి కింద రూ.500 చెల్లించాలని డిమాండ్ చేశారు. పనిముట్లు సబ్సిడీపై ప్రభుత్వం పంపిణీ చేయాలని కోరారు. అనంతర లేబర్ అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. తర్వాత విద్యుత్తు శాఖ ఎడిఇ జి.శంకరరావు, ఉద్యానశాఖ అధికారి, మండల తహశీల్దార్ కార్యాలయంలో వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరాడ ఈశ్వరరావు, చిన్నారావు, పండు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న పామాయిల్ కార్మికులు, యూనియన్ నాయకులు

ఎఫ్ఆర్‌సిని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపల్ కార్మికులు ఉద్యోగులు, ఒప్పంద కార్మికులకు ఎసరు పెట్టే ఎపిఎఫ్ఆర్‌సి విధానాన్ని వెంటనే ఉపసంహరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం బెలగాంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందించారు.. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికుల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులే ఉన్నారని, స్మార్ట్ ఫోన్లు లేవని, ఇలాంటి తరుణంలో ఫేస్ యాప్‌లో హాజరునమోదు కష్టమన్నారు. ప్రభుత్వం చెప్పినట్లుగా కార్మికులు ఫొటో తీసుకొని పంపించకపోతే తాను రోజంతా పనిచేసినా వృథా అన్నారు. సక్రమంగా ఫొటో పంపకపోతే ఆ కార్మికుని హాజరు పడదని చెప్పారు. దీనివల్ల జీతం కోత పడుతుందని, ఉద్యోగం నుంచి కూడా తొలగించే అవకాశముందని తెలిపారు. వెంటనే ఫేషియల్ హాజరు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సింహాచలం, ఎం.శివ రాజేషు, వరదరాజు, పోపులమ్మ, నీలమ్మ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి అందిస్తున్న సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు

పక్కాగా ఎన్నికల నిబంధనలు

ప్రజాశక్తి-కొమరాడ

ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నిక ప్రవర్తన నియమాలను గ్రామస్థాయి నుంచి పక్కగా అమలు చేయాలని ఎంపిడిఒ అప్పారావు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాల్లో విగ్రహాలకు ముసుగులు ధరించాలని చెప్పారు. రాజకీయ పార్టీల నాయకులకు సంబంధించిన ఫొటోలతో కూడిన పోస్టర్లను తక్షణమే తొలగించాలన్నారు.

15న రహదారి భద్రతా కమిటీ సమావేశం

ప్రజాశక్తి బిపార్వతీపురం రూరల్

రహదారి భద్రతా కమిటీ సమావేశాన్ని ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు జిల్లా రవాణాశాఖాధికారి సి.మల్లికార్జునరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో శాఖల వారీగా చేపట్టాల్సిన రహదారి భద్రతా కార్యక్రమాలపై సమావేశంలో చర్చించనున్నట్లు వెల్లడించారు. సమావేశానికి జిల్లాలోని రహదారి భద్రతా కమిటీ సభ్యులు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

జాబ్‌మేళా రద్దు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 17న సాలూరులో గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో నిర్వహించాల్సిన జాబ్‌మేళాను ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా రద్దు చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

ర్యాలీ చేపడుతున్న ఎంపిటిసి మల్లేశ్వరరావు, వైద్య సిబ్బంది

కుష్టు వ్యాధి నివారణకు కృషి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కుష్టు వ్యాధిని నివారించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఇరిడి ఎంపిటిసి కద్రక మల్లేశ్వరరావు కోరారు. సోమవారం గుమ్మలక్ష్మీపురం మండలం ఇరిడి పంచాయతీలో కుష్టు రోగ నివారణ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు, సిహెచ్‌డబ్ల్యూఒ లు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో మొండెంఖల్ పంచాయతీ తాబేలవలస గిరిజన గ్రామానికి మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరుతూ సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, గరుగుబిల్లి సూరయ్య, కుండంగి లింగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వారిని ఎస్‌టిలో చేర్చొద్దు

ప్రజాశక్తి-సీతంపేట

సంతలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

బోయ, వాల్మీకి, బెంతు ఒరియా, మత్స్యకారులను ఎస్‌టిలో చేర్చవద్దని గిరిజన సంఘం నాయకులు కోరారు. ఈమేరకు సీతంపేట సంతలో సోమవారం గిరిజన సంఘం నాయకులు పి.సాంబయ్య, ఎ.గంగాధర్, జె.శ్రీరాములు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ నంబర్ 3ను అమలు చేయాలని, నాన్ షెడ్యూల్ గ్రామాలను ఐదో షెడ్యూల్డ్‌లో చేర్చాలని డిమాండ్‌చేశారు.

నిరుపేద యువతి పెళ్లికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని వెంకటభైరిపురంలో నిరుపేద కుటుంబానికి చెందిన యువతి పెళ్లి కోసం ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్పంచ్ మరడ వెంకటరత్నం రూ.10 వేలు నగదు, పెళ్లి సామగ్రి అందించారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మరడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే మెమోలు

ప్రజాశక్తి- బొబ్బిలి

జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే ఛార్జ్ మెమోలు జారీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జగనన్న ఇళ్ల నిర్మాణంపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో, ఐటిఐ కాలనీ లేఅవుట్లలో జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. బ్రిక్ వర్క్ ప్రారంభమ య్యేలా చూడాలని కోరారు. ఈనెల 20 నాటికి 70 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని సోంపురం గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ బిఎస్‌కెఎం పట్నాయక్ సోమవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డుతో పాటు సిబ్బంది రోజువారి నిర్వహిస్తున్న విధులకు సంబంధించిన రికార్డులను కూడా పరిశీలించారు. ప్రధానంగా ఇంటి పన్ను వసూలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యూ పిసి షెడ్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి- బొబ్బిలి

భారత దేశానికి విధి నిర్వహణలో భాగంగా ఫిబ్రవరి 13న మదర్ థెరిసా వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం మదర్ థెరిసా ట్రస్ట్ ఆర్గనైజర్ క్లైవ్ కూపర్ ఆధ్వర్యంలో 15 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. ప్రముఖ వైద్య సేవకులు తప్పిట సత్యనారాయణ సారధ్యంలో ఇందిరమ్మ కాలనీలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రములో జిల్లా బిఎస్‌సి ఇన్‌ఛార్జి సోరు సాంబయ్య, ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధన సమితి కన్వీనర్ కనక మహేష్ పట్నాయక్, బ్రదర్ సైమన్, సింగారపు గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.50వేలు విరాళం

ప్రజాశక్తి- కొత్తవలస

కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలోని డ్రైవర్స్ కాలనీలో కొలువైన లక్ష్మీ గణపతి ఆలయ అభివృద్ధికి కొత్తవలస మాజీ సర్పంచ్ మామిడి సరయ్య శెట్టి రూ.50వేల నగదును విరాళంగా అందజేశారు. సోమవారం స్వామి వారిని దర్శించి, కమిటీ సభ్యులకు నగదును అందజేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. నగదును ఆలయ అభివృద్ధి పనులకు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

తైక్వాండోలో జిల్లాకు పతకాల పంట

ప్రజాశక్తి- విజయనగరం

ఈ నెల 12న కాకినాడలో జరిగిన 38వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ తైక్వాండో పోటీల్లో విజయనగరం క్రీడాకారులు 11 మెడల్స్ సాధించారు. ఇందులో ఒక గోల్డ్ మెడల్, నాలుగు సిల్వర్ మెడల్స్, ఆరు బ్రాంజ్ మెడల్స్ ఉన్నాయి. ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో మూడో స్థానం సాధించారు. వీరిని జిల్లా తైక్వాండో అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు సోమవారం అభినందించారు.

ఇపిఎఫ్ పెన్షన్ రూ.9 వేలివ్వాలి

పిఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పింఛనుదారులు

ఇపిఎఫ్ పెన్షన్ రూ.9వేలకు పెంచాలని, ఉచిత వైద్యం అందించాలని సోమవారం పిఎఫ్ కార్యాలయం వద్ద పింఛనుదార్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పింఛన్లదార్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. నాగభూషణం డిమాండ్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్లను చిన్న చూపు చూస్తున్నాయని అన్నారు. పెరిగిన ధరలతో పోల్చుకుంటే ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ ఎటూ చాలడం లేదన్నారు. కేవలం పెన్షన్ మీద ఆధారపడి బతికేవారు ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇల్లు గడవడానికి నానా కష్టాలు పడుతున్నారని అన్నారు. ఈ వయసులో బిపి, షుగర్లతో కాలం గడుపుతున్నారని అన్నారు. ఏమైనా పెద్దపెద్ద అనారోగ్య సమస్యలు వస్తే తట్టుకోలేక ఆర్థికంగా అప్పుల పాలౌతున్నారని ఆవేదన చెందారు. కావున ప్రభుత్వం ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం పిఎఫ్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శేషగిరి, నాయకులు జామి రామారావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-వీరఘట్టం

రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సోమవారం రేగులపాడు సచివాలయం ఎదుట తెలుగు రైతు నాయకులు జి.గజేంద్రనాయుడు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం సచివాలయ కార్యదర్శి విమలకు వినతిపత్రం అందజేశారు.

26న ప్రజ్ఞా వికాస్ పరీక్షలు

ప్రజాశక్తి-సాలూరు

పదోతరగతి విద్యార్థుల సృజనాత్మక శక్తి పెంపొందించడానికి ఈ నెల 26న మన్యం జిల్లా వ్యాప్తంగా ప్రజ్ఞా వికాస్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.పండు, మండల కార్యదర్శి వరుణ్ చెప్పారు. సోమవారం బంగారమ్మపేట హాస్టల్‌లో వారు దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యాన పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వారికి ఐదు, మూడు, రెండు వేల రూపాయల నగదు బహుమతి అందజేయనున్నట్లు చెప్పారు. మండల స్థాయిలో నిలిచిన వారికి మెమోంటోలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు విద్యార్థులు 7601037266 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వసతిగృహాలను పర్యవేక్షించాలని వినతి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

జెసికి వినతి అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రభుత్వ సంక్షేమ వసతీగృహాలు, పాఠశాలలను జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్ సోమవారం జెసి ఆనంద్‌కు వినతి అందించారు. అనంతరం పి.రాజశేఖర్ మాట్లాడుతూ వసతిగృహాల్లో మెనూ సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఎఎన్‌ఎంలను నియమించాలని, ఖాళీగా ఉన్న వార్డెన్, కుక్, కమాటి, వాచ్‌మెన్, హెల్పర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీగోడలు, వంటశాలలు, బోర్లు, పోస్టుమెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు సమకూర్చాలని డిమాండ్ చేశారు. మక్కువ పాఠశాలలో ఆహార కొరతవల్లే విద్యార్థుల ఆరోగ్యం క్షీణించి, సరైన వైద్యం లేక ఇంటర్ ద్వితీయ సంత్సరం చదువుతున్న కొండగొర్రె యోగేశ్వరి మృతిచెందినట్లు తెలిపారు. వెంటనే విచారణ కమిటీని నియమించి, బాధ్యులను విధుల నుండి తొలగించాలని, విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సందర్భంగా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు పెంచాలని, బకాయిలో డైట్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కమిటీ సభ్యులు కె.భాస్కరరావు, ఎల్.నవీన్, కె. రాజేంద్ర పాల్గొన్నారు.

నత్తనడకన వంతెన పనులు

ప్రజాశక్తి-కొమరాడ

వంతెన పనులపై ఆరా తీస్తున్న సిపిఎం, టిడిపి, జనసేన నాయకులు

నిధుల విడుదలలో జాప్యంతో పూర్ణపాడు - లాబేసు వంతెన పనులు నత్తనడకన సాగుతున్నాయని టిడిపి నాయకులు పల్లవి రాజు, సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, జనసేన నాయకులు సురేష్ అన్నారు. సోమవారం వంతెన పనులను వారు పరిశీలించారు. సూపర్ వైజర్ వెంకటేశ్వర్‌రెడ్డిని పనులు ఎందుకు చేపట్టడం లేదని నాయకులు ప్రశ్నించగా, నిధులు విడుదల కాకపోవడంతో నిలిపేశామని ఆయన బదులిచ్చారు. 15వ తేదికి నిధులు విడుదల చేస్తామని పంచాయతీరాజ్ శాఖ ఇఇ చెప్పారని వివరించారు. దీనిపై నాయకులు స్పందిస్తూ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రచార ఆర్భాటమే తప్ప పనుల్లో కదలిక లేదన్నారు. మూడు నెలల్లోనే పనులు వేగవంతం చేస్తే కొంతమేరకు ఉపయోగం ఉంటుందన్నారు.

జగనాసుర రక్త చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

జగనాసుర రక్తచరిత్ర పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు ఉదంతాన్ని ఉటంకిస్తూ, అందులో వైసిపి పాత్రను వివరిస్తూ టిడిపి నాయకులు సోమవారం జగనాసుర రక్త చరిత్ర పుస్తకాన్ని విడుదల చేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొబ్బిలి చిరంజీవులు పార్టీ శ్రేణులతో కలిసి పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత చిన్నాన్న హత్య కేసులో నిందితులెవరో రాష్ట్రంలో ప్రజలందరికీ ఇప్పటికే తెలిసిపోయిందని, ముఖ్యమంత్రి ఈ విషయంపై ఇంకా అమాయకత్వం నటించడం మానుకోవాలని హితవుపలికారు. మరి కొద్దిరోజుల్లో బండారమంతా బయటపడబోతుందన్నారు. అప్పుడు రాష్ట్ర ప్రజల ముందు తలదించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.వెంకట నాయుడు, ఉదయభాను, జాగాన రవికుమార్, కోల వెంకట్రావు, కౌన్సిలర్లు బడే గౌరినాయుడు, టి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ధర్నా

ప్రజాశక్తి కొమరాడ

మండలంలో నాగావళి నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, టిడిపి నాయకులు పల్లవి రాజు, జనసేన నాయకులు ఎస్.రమేష్ ఆధ్వర్యాన సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం తహశీల్దార్ సిహెచ్ రాధాకృష్ణకు వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రామభద్రపురం గ్రామ సమీపంలో నాగావళి నది సమీపంలో ఇసుక రీచ్‌కు అనుమతులు లేవని, కానీ ప్రతిరోజూ యధేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారని చెప్పారు. దీనిపై అధికారుల దృష్టికి తీసుకెళ్తే తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

స్పందనలో ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి దిలీప్ కిరణ్, ఎస్ఇబి ఇన్స్పెక్టర్ ఎన్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి ఇన్స్పెక్టర్ ప్రభాకర్, డిసిఆర్‌బి సబ్‌ఇన్స్పెక్టర్ దినకర్ పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్

డిటిఒ గణేష్ మృతికి నివాళి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మౌనం పాటిస్తున్న ఖజానా శాఖ కార్యాలయ అధికారులు, సిబ్బంది

విజయనగరం జిల్లా ఖజానా శాఖాధికారి ఎస్.ఆర్.కె.గణేష్ మృతికి జిల్లా ఖజానా శాఖ అధికారులు, సిబ్బంది సోమవారం నివాళులర్పించారు. జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో డిటిఒ ఎ.మన్మథరావు ఆధ్వర్యాన సహాయ ఖజానా అధికారి కె.శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది.. గణేష్ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. డిటిఒ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కురుపాం : విజయనగరం డిటిఒ ఎస్.ఆర్ .కె.గణేష్ మృతిబాధాకరమని స్థానిక ఉపఖజానాధికారి కె.శంకర్రావు అన్నారు. సోమవారం సబ్ ట్రెజరీ కార్యాలయం వద్ద రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. గణేష్ సబ్ ట్రెజరర్‌గా ఉన్నప్పుడు చేసిన సేవలను గుర్తుకుతెచ్చుకున్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

ఎంపిడిఒకు వినతి అందిస్తున్న కార్మికులు, నాయకులు

స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం ఎంపిడిఒ డొంక త్రినాథులుకు ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని కాపాడుతున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కాద రాము, యూనియన్ నాయకులు సిహెచ్.శంకరరావు, బి.రవికుమార్, జి.దుర్గారావు, కె.కూర్మరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని వెంకటాపురంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రి వైద్యులు జి.ఆశాలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిపి, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అన్ని వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఆహారపు అలవాట్లలో కొన్ని సూచనలు చేసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రేగులపాడులో..

వీరఘట్టం : మండలంలోని రేగులపాడు గ్రామంలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు నితీష, మానస రోగులకు, పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సిహెచ్ పల్లవి, టెక్నీషియన్ దినేష్ పాల్గొన్నారు.

విమానాశ్రయ నీటి వనరుల కోసం పరిశీలన

నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ శాస్త్రవేత్త సందర్శన

నందిగాం ప్రాంతంలో పరిశీలిస్తున్న సైంటిస్ట్ మురళీధర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురంలో త్వరలో నిర్మించబోయే అంతర్జాతీయ విమానాశ్రయానికి నీటి సరఫరా కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు తెలిపారు. నీటి వనరులను పరిశీలించేందుకు నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సైంటిస్ట్ డి. మురళీధరన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఉమాశంకర్ ప్రతిపాదిత ప్రాంతంలో సోమవారం పర్యటించారు. భోగాపురం మండలం నందిగాం, పూసపాటిరేగ మండలం కొప్పెర్ల, కొత్త నడిపల్లి ప్రాంతాలను పరిశీలించారు. ఎయిర్‌పోర్టుకు కావలసిన నీటి లభ్యత అంశాలపై చర్చించారు నదులు, చెరువుల నుంచి సముద్రంలో కలసిన నీరు మళ్లీ తిరిగి వెనక్కి రావడంతో పరిసర ప్రాంతాలు ఉప్పునీరుగా మారడంతో తీరంఒడ్డున రక్షణ గోడ నిర్మాణం కోసం పరిశీలించారు. రక్షణ గోడ నిర్మిస్తే విమానాశ్రయానికి నీరు మరల్చే ప్రక్రియ చేపట్టవచ్చని అన్నారు. ఉన్న అవకాశాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. సముద్రపు నీటిని డి శానిటైజేషన్ చేసేందుకు సాధ్యాసాధ్యాలపై అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ ఎవిఎస్ రాజన్, జెఇ హేమంత్ కుమార్, ఎఇఇ మహమ్మద్ పాషా, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

80 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి-పాచిపెంట

పాచిపెంట గ్రామ శివార్లో ఎస్‌సి కాలనీకి చెందిన గుణాన దాసు బైక్ మీద నాలుగు క్యాన్లలో సారా తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. 80 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, దాసును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని పాంచాలి గ్రామానికి చెందిన గన్ను సోమశేఖర్ (28) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఎం.వెంకటరమణ కథనం ప్రకారం.. పాంచాలి గ్రామానికి చెందిన గన్ను యుగంధర్ కుమారుడు సోమశేఖర్ వివాహ విషయంలో ఇంట్లో కుటుంబీకులతో మనస్పర్థలు వచ్చి మూడు రోజుల క్రితం ఇంటి నుండి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం పాంచాలి గ్రామ శివారులో సెల్‌టవర్ కేబుల్ నిర్వహణ గదిలో ఉరి వేసుకుని ఉన్న వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్తులు చూసి, పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సిహెచ్‌సికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

ఉరేసుకున్న సోమశేఖర్

LOST OF CERTIFICATES
It is Notified for the Information that my Original Qualifying Examination Certificate of Main Secondary Examination of year 2003 and Roll No : 4145096 issued by CBSE has been actually lost.
Name of the Candidate:
Nagireddi Kranthi Kumar,
Full Address: Door No: 30-2-100, Rama Colony, Salur, Pincode: 535591.
Cell: 8919177268